ఆంధ్రజ్యోతి (అక్టోబర్ 90) సంవత్సర ప్రత్యేక సంచిక

# సమ్మోహనరాగం

'నా హృదయంలో నిదురించే చెలీ
కలలోనే కవ్వించే సఖీ
మయూరివై వయారివై నేడే
నటనమాడినావే నన్ను దోచినావే..'

రేడియోలోంచి వచ్చే పాటను వింటూ నడి వీధిలో నిలబడిపోయాడు మోహన్.

'.... నా గానములో నీవే ప్రాణముగా పులకరించినావే
పల్లవిగా పలుకరించరావే!....'

ఆ పాటలోని రసానుభూతి ఒళ్ళంతా జల్లుమనిపిస్తుండగా రాజారావింటి తలుపు తట్టాడు మోహన్.

"వచ్చారా! ఇంకా రాలేదేమిటా అని చూస్తున్నా!" అంది తలుపు తెరచిన పల్లవి!

అతని గుండె గొంతుకలోకి వచ్చింది. "నిజంగా?"

"పోనీ, అబద్ధంగా!" అంది ఆమె గోముగా.

కన్నార్పకుండా చూశాడు. అజంతా శిల్పానికి అందాలు దిద్దుతూ ఆ ముద్దరాలు ఒయ్యారంగా నిలుచుంది. ఎప్పుడూ ఆ అన్నులమిన్నలో తానెరుగని అందాలేవో ఇప్పుడు కన్నుల విందు చేస్తున్నాయి.

"ఏమిటలా చూస్తూ నిలబడి పోయారు?"

"మీ ఇంటికి ఎప్పుడు వచ్చినా నాకేమిటో కొత్త కొత్తగా వుంటుంది!"

"అంటే?" అంటూ లోపలికి దారితీసింది.

ఆ నడకలో ఎంత హొయలు! ఆ నడుం విరుపులో ఎంత విలాసం! ఆ ఒంపు సొంపుల్లో ఎంత సొగసు! ఏడాదిగా ఆ యింటికి వస్తున్నాడు. ఎప్పుడూ ఆమె సౌందర్యాన్ని ఇంతగా పరీక్ష పెట్టి చూడలేదు. "వేయి రంగులు, వేయి పరిమళాలు!" అన్నాడు అప్రయత్నంగా.

అందమైన తన పెద్ద పెద్ద కళ్ళని మురిపెంగా విపరిస్తూ "ఎంత కవులయితే మాత్రం అంత అతిశయోక్తులా!" అంది పల్లవి.

"నీ ఎదుటికి వచ్చాక ఎంతో కొంత కవితను పిండుకోకుండా వుండడం ఎవరితరం!"

"అబ్బ, అంత అందమైన భావాలు మీకవులకెలా వస్తాయో బాబూ!"

"నిన్నూహించి రెండు ముక్కలు చెపితే అవే రెండు రెక్కలయి ఊహ ఆకాశానికెగురుతుంది. అదే ఒక గీతం అవుతుంది. నువ్వు ఆలపిస్తే మధుర గానమూ అవుతుంది!"

ఆమె కపోలాలు ఎర్రనయ్యాయి. "కవిగారునిద్రలోంచి సరాసరి లేచి వచ్చారా యేం!"

"రాత్రి నేనూ నా దిండూ కలిసి కలలు కంటాం. పగలు నేనూ నా కలం వాటిని పంచుకుంటాం!"

"ఇలా కలలు కంటూ కూర్చోకపోతే చక్కగా హాయిగా పెళ్ళి చేసుకో రాదా!" అంది ఆమె తన ముచ్చటయిన మూతిని మురిపెంగా తిప్పుతూ.

"యుగయుగాలుగా వెతుకుతున్నా - ఆమె ఇంకా కనిపించలేదు. ఏ క్షణాన మొదటిసారి చూస్తానో నిద్ర నా కన్నుల్ని విడిచిపోతుందని భయం!"

"భలేవారే!"

"ఈ క్షణం కలకాకుండా వుంటే అంతే చాలు!"

"ఒక వేళ ఇదే కలయితే?" అని ఆమె కవ్వించకుండా వుండలేని దానిలా నవ్వింది.

"ఇలాంటి కల కలకాలం రావాలని వెయ్యి కలలు కంటాను"

"అమ్మో! మీతో ఏ మాట అన్నా ప్రమాదమే!" కాని, నీ ప్రతి మాటా నాకు ప్రమోదమే పల్లవీ!' అని అందామని పెదవి చివరి దాకా వచ్చిందతనికి. ఆనాడు ఆమె ప్రతి పలుకూ అతన్ని గిలిగింతలు పెట్టి పరవశింప చేస్తోంది. అజ్ఞాతమైన అతీతమైన సంస్పర్శ కోసం తహతహ. మహోజ్జ్వల ప్రేమ రసైక రాశికోసం చేసిన నిరీక్షణ ఫలించినట్టు భావన. ప్రేమ

సాఫల్యానుభూతి కవితా మధు స్రవంతిగా తన గొంతులో కురుకుతున్న ప్రతిస్పందన.

'జన్మ జన్మలకి పూర్వం నాలో నీవూ నీలో నేనూ వున్నాము కాబోలు! ఆ కన్నుల్లో దర్శిం చాను ఎప్పుడో నిష్క్రమించిన నా పరిమళ ప్రపంచాన్ని' అనుకుంటూ ఆమె వైపు కన్నార్పకుండా చూస్తుండిపోయాడు. అతని మనస్సు వెళ్ళిపోయిందెక్కడికో మమతల పందిళ్ళల్లో మల్లెపూలేరు కొనేందుకు!

బిడియంగా కనురెప్పలు రెపరెపలాడిస్తూ "ఏమిటొక్కసారిగా మౌనవ్రతం పట్టారు!" అంది పల్లవి.

"నువ్వలా చూస్తుంటే భయమేసి!"

"పోదురూ!" అని మందహాసం చేస్తూ వంటింట్లోకి వెళ్ళిపోయింది.

మనస్సు సౌందర్యాన్ని హాయినీ వదులుకోలేదు. పాతికేళ్ళు పరువాలొలికే పల్లవి ప్రతికదలికలోనూ ఒక హరివిల్లు! అతని కది పన్నీటిలో కడిగిన క్షణంలా వుంది.

"మీరు చెప్పిన రెండు పాటలూ బాగా వచ్చాయి. పాడి వినిపించనా!" అంది పల్లవి కాఫీ కప్పునందిస్తూ.

తలవూపాడతను. వీణ తెచ్చుక్కూర్చుంది ఆమె. తన కోమల కంఠాన్ని విప్పింది. వీణ తంత్రుల్ని ఆమె మునివేళ్ళు మీట సాగాయి. ఒకటి త్యాగరాజ శృతి. మరొకటి ఎంకిపాట! ఒకటి భక్తిరసం. మరొకటి శృంగార రసం. ఒకటి హిందోళము – మరొకటి మోహనరాగం. ఆ గదిలో రాగవాహిని వెల్లువలా పొంగింది. రస నిర్ఝరి పొంగి పొరలింది. ఆ రమణీయ రసానురాగ సాంగత్యంలో అతని అణువణువూ పులకించింది.

ప్రశ్నార్థకంగా అతని వైపు చూసింది పల్లవి.

"నీ మధుర గానంలో తడిసిన సంధ్య ఎంత అందాన్ని చెమరిస్తోందో చూడు!"

కెంపు రంగు పూసుకున్న ఆమె బుగ్గల్ని చూసి చిరు చెమటకి తడిసిన ఆమె ముంగురుల్లు ముసిముసిగా నవ్వాయి. "అంతంత మాటలెందుకు? మామూలుగా బావుందంటే చాలదా!" అంది బిడియంగా.

"నువ్వలా సరిపెట్టుకుంటానంటే ఇక నుంచి అబద్ధాలే చెపుతాను" అని నవ్వాడతను.

"సర్లెండి. గొప్పనుకుని స్టేజి మీద కెక్కాక గొంతు పెగలకపోతే? ప్రోగ్రాము డేటు దగ్గర కొస్తోందంటే నాకు చచ్చేంత భయంగా వుంది!"

"నీలాగే మొదట నేనూ భయపడ్డాను. మొదటిసారి స్టేజీ మీదకెక్కే వాళ్ళందరికీ ఆ భయం వుంటుంది. అదెంత సేపు? అయిదునిముషాలు. రాగధారల్లో తడిసిన తరువాత భయాలన్నీ దూది పింజల్లా ఎగిరిపోతాయి. పైగా నేను పక్కనుండగా నీకు భయం దేనికి?"

'మనిద్దరం కల్సి పాడాలని మీరు రాసిచ్చారటగా! ఆ పాట తెచ్చిచ్చారు. ఆయన మెచ్చారు. నాకూ నచ్చింది"

"చూశావా! నీ నోట కూడా కవితలు పలుకుతున్నాయ్!" అని నవ్వాడు.

ఆమె బుగ్గల్లో సిగ్గు మొగ్గ వేసింది. "ఇంకానయం!"

"ఈ యింటి గోడలు కిటికీలు ఇప్పటికే సంగీత కచేరీలు చేస్తున్నాయి. రేపవి కవితలల్లినా ఆశ్చర్యం లేదు"

"మీ అతిశయోక్తులకేమి కాని.. చేసిన పని చెప్పనివ్వండి. ధైర్యం చేసి మీరు కట్టిన వరసకీ నా సొంత వరస జోడించాను. ప్రాక్టీసు కూడా చేశాను. వింటానంటే..."

"అంతకంటేనా?" అన్నాడతను సంతోషంగా.

"మీ చరణం మీరందుకుంటేనే బావుంటుందేమో!" అంది సిగ్గుగా.

"అలాగే! కాదన్నానా!"

ఆమె వీణాతంత్రులు మంద్రంగా మీటింది. అతని మనస్సు వుండుండి జల్లు జల్లుమంది. "తియతీయగ నీ వీణ మ్రోగింది!" అన్న మొదటి చరణం రాగయుక్తంగా అతని గొంతులోంచి బయటకు దూకింది. వింత అనుభూతితో తన ఒళ్ళు పులకలెత్తుతుండగా "కమకమ్మని కవితా సాగిందీ" అంటూ పల్లవి అనుపల్లవి అందుకుంది.

అతను : సరిగమలు స్వరజతులు జతజతగా
తియతీయగ నీ వీణా మ్రోగిందీ!

ఆమె : రసమయమై హృదయ రంజితమై
కమకమ్మగ నీ కవితేసాగింది

అతను : నీ గానములో తేనెలు కురిసినవీ
నీ రాగములో నను వూయల లూపినవీ –

ఆమె : నీ కవితల ప్రసూనాలు విరబూచినవీ
నా అణువణువూ పరిమళాలయి గుబాళించినవీ

అతను : నీ నోట పలికి నా కవిత తియ్యనయినదే చెలీ!

ఆమె : నీ పాటగ నా గుండె నిండి వీణ మీటుతున్నదోయీ!

అనిర్వచనీయమైన క్షణం. అతని కోటినాదుల దారుల్లో విరసిన రసానుభూతి – అతని కనురెప్పల చివర్ల నీటి బొట్లయి నిలిచింది.

"ఏమండీ! మోహన్! ఏమిటదీ! ఎందుకలాగయిపోయారు?" అంటూ ఆమె తన చేతి మీద చేయి వేసి వూపే వరకూ అతను స్పృహలోకి రాలేదు.

ఆమె మృదు కరస్పర్శ. ఎప్పుడూ ఎరుగని మధుర సంస్పర్శ. "నీ గొంతులో ఇంత మాధుర్యం వుందని ఇంతకాలం తెల్సుకోలేక పోయిన మూర్ఖుడ్ని. నన్ను క్షమించు పల్లవీ!" అంటూ ఆమె చేతి వ్రేళ్ళను పట్టుకుని పువ్వుల్ని నిమిరినట్టు స్పృశించాడు.

ఆమె చకితురాలైంది. "అలాగనకండి. మీ అంత చక్కగా పాడేదాకా...."

"కాదు కాదు పల్లవీ! నిజం చెపుతున్నా. నా కవితకి జీవం పోశావు. దాహంతో చచ్చిపోతున్న వాడికి ప్రాణం పోసినట్టు పోశావు" అనూహ్యమైన ఆవేశమేదో అతని చేతి

వ్రేళ్ళలోకి చిందింది. తట్టుకోలేకపోయాడు. పట్టు తప్పిపోయాడు. ఆమె చేతుల పూగుత్తిని తన బుగ్గలికి రాసుకుంటూ తన పెదవులకద్దుకున్నాడు. ముద్దులతో ముంచెత్తాడు.

ఆమె పిచ్చిదానిలా చూసింది. తన చేతుల్ని తన వైపుకి లాక్కోవాలనుకుంది. కాని, అదేమి శక్తో! అతని వైపే లాక్కుపోయింది.

"ఇప్పుడు దేవుడే దిగి వచ్చి నీకేం కావాలని అడిగితే నీ మధుర కంఠం ఎప్పుడూ ఇలాగే రాగవాహినితో నిండే వరం ఇవ్వమంటాను. నీవి ప్రేమించే పెదవులుగా మలచమంటాను."

ఆమె అధరాలు అదిరాయి. కళ్ళు చలించాయి. ఒళ్ళు కంపించింది. నిలువెల్లా వణికి పోతూంది. "మోహన్!" అని ఎలాగో గొంతు పెగల్చుకుంది.

"ఆ దేవుడ్ని కాదు. ఈ దేవతనే ఒక వరం అడగాలని వుంది. వచ్చానొక కిరణం కోసం. నా కవితా చరణం కోసం. నీ కిరణాల్లో స్నానం చేశాను. మధుర స్మరణల్లో నా చేత గానం చేయించావు. నన్ను నేను చేరుకున్నాననిపించావు"

అతని పెదవుల్నించి వస్తున్నవి ప్రేమావేశంతో పూరించుకున్న మాటలో - రసరమ్య కవితా ధారం చినుకులో ఆమె కంతు పట్టలేదు.

"ఒక్కసారి! ఒక్కసారి నా పాటకి ప్రాణం పోసిన ఆ కంఠాన్ని ముట్టుకోనివ్వవూ!"

అతని పాటలోనే కాదు. అతని మాటలోనే కాదు. అతని స్పర్శలో కూడా ఏదో సమ్మోహనశక్తి వుంది. తన కంఠాన్ని అతని ముని వ్రేళ్ళు ముట్టుకుంటున్నప్పుడే కాదు తన పెదవులతో ముద్దు పెట్టుకున్నప్పుడు కూడా ఆమె అడ్డు పెట్టలేకపోయింది.

అతని నరాల్లో ఉత్తుంగ తరంగితమైన రసానుభూతి ఆమె గుండెల్లో ఆమె తనూలతలో ఆమె అణువణువు లోనూ ఎన్నడూ ఎరుగని ప్రకంపనాలు పలికించింది. కాలదూరాల తీరాలను విడిచిన స్పృహ ఎప్పుడో ఎక్కడో వాళ్ళు పారేసుకున్న మధుమాసానికి మాత్రం పరిమితమైపోయింది.

ఆమె వలపుల రాణయి అతని యింద్రియాల గిన్నెల నిండా వెన్నెల నింపింది. అతని మధురాధరాల స్పర్శ ఆమె తనువెల్లా నవవసంతం పరుగులెత్తించింది. మాటల కందని అర్థాలేవో త్రవ్వి పోసుకుంటున్న హృదయాలు వాళ్ళ గాఢ పరిష్వంగంలో వేయి విధాలుగా గుసగుసలాడుకున్నాయి. అంతా మిథ్య తామిద్దరే వాస్తవం. ఈ క్షణమే నిజం... వాళ్ళకి కాలం స్తంభించిపోయింది.

ఉన్నట్టుండి ఒక్కసారిగా స్పృహలోకి వచ్చి కళ్ళు తెరిచింది పల్లవి. చూస్తే తాను మోహన్‌ని గాఢంగా పెనవేసుకుని ఉంది. గబుక్కున అతన్ని వదిలి పెట్టి పరీక్షగా చూసింది. ఓరగా తెరుచుకున్న తలుపు చూసే సరికి ఆమెకు వల్లమాలిన భయంతో ఒళ్ళు జల్లుమంది. "ఆయన వచ్చినట్టున్నారు. తలుపు చప్పుడయింది" అంటూ అతని కౌగిల్ని త్రోసేసి గబుక్కున పైకి లేచి పరుగు పరుగున గుమ్మం దగ్గరకి వెళ్ళి తలుపులు తెరిచి బయటకు చూసింది. రాజారావు సంజ చీకట్లలోకి నడిచి వెళ్ళిపోవడం లీలగా కనిపించింది.

ఒక్క పరుగున లోపలకి వచ్చి "ఆయన వచ్చి మనల్ని చూసి వెళ్ళిపోయినట్టున్నారండీ!" అంది బేలగా.

మోహన్ నిరుత్తరుడయ్యాడు. " ఓ మైగాడ్! ఎంత పని జరిగింది!" అన్నాడు నిస్పృహగా. కొన్ని నిముషాల క్రితం స్వర్గపుటంచుల్ని స్పృశించాడు. ఇప్పుడు అగాథంలోకి పడిపోతున్న ట్టుగా ఉంది. అలౌకికానందానికీ పరమ దుఃఖానికీ ఇంతేనా ఎడం!... తనను తనే నిల దొక్కుకోలేనివాడు ఆమె నేమని ఓదార్చగలడు?

"నన్ను క్షమించు పల్లవీ!" అని ఆఘాతం తగిలి చేష్టలుడిగి కొయ్యబారిపోయిన ఆ బొమ్మని నిరాధారంగా వదిలి విమూఢునిలా వీధిలోకి నడిచి వెళ్ళిపోయాడు మోహన్.

● ● ●

రాత్రి ప్రొద్దుపోయి వచ్చాడు రాజారావు. పల్లవి వైపు అతను చూసింది ఒక్క క్షణమే! ఆ చూపుకి ఈదురుగాలిలో చిగురుటాకులా రెపరెపలాడిపోయింది పల్లవి!

నెమ్మదిగా బట్టలు మార్చుకుని మంచం మీద వాలిపోయాడతను.

ఏ క్షణంలోనయినా గట్లు త్రెంచుకునే ఏరుల్లా వున్నాయి ఆమె కళ్ళు. "అన్నం పెట్టనా?" అంది అతి కష్టం మీద గొంతు పెగల్చుకుని.

"అనుకోకుండా ఓ ఫ్రెండు కలిసాడు. హోటల్లో భోంచేసేసాము. నువ్వు తినెయ్!" అంటూ అటు తల తిప్పుకు పడుకున్నాడు.

అంతకంటే తనని పట్టుకొని 'నీకింత కండకావరమేమిటి'ని నానా విధాలుగా తిట్టినా ఆమె కంత బాధ వుండేది కాదేమో! క్షణమో యుగంలా గడుస్తోంది ఆమెకు. అతని దగ్గరకు వెళ్ళలేని అశక్తత! వెనక్కి తిరిగి వెళ్ళలేని అపరాధ భారం! అలా ఎంత సేపు గడిచిందో తెలియదు.. వీధి తలుపు మీద చప్పుడయి ఉలిక్కిపడింది.

అటు చూసింది. రాజారావిటు తిరగలేదు. తనే వెళ్ళి తలుపు తీసింది. అతను మసక చీకట్లలో నిలబడినా ఇట్టే గురుగుర్తుపట్టింది. "మీరా?" అంది తెల్లబోతూ.

"రాజా వచ్చాడా? నిన్నేమయినా..." అన్నాడు మోహన్ లోగొంతుకతో.

"ఇంతకు ముందే వచ్చారు. పడుకున్నారు."

"ఆ సంగతి.." అని అర్థోక్తిలో ఆగిపోయాడు. గది దీపం వెలుగులో అశ్రుపూరితమైన ఆమె కళ్ళు అతన్ని కొట్టవచ్చాయి. "ఏమీ మాట్లాడలేదు."

"నన్ను క్షమించు పల్లవీ! దీనికంతకీ నేనే బాధ్యుడ్ని."

"లోపలకి రండి" అంది గద్గదస్వరంతో.

"ఉహూ! క్షమించమని అడగడానికి రాలేదు. నా మూలంగా నీ కాపురంలో చిచ్చు పుట్టిందే అన్న బాధ కొద్దీ వచ్చాను. కాని, రాజా కెదురవడానికి నాకు మొహం చెల్లడం లేదు. అందుకే ఈ ఉత్తరం రాసి తెచ్చా. ఇది చదివి నాదేమీ తప్పు లేదని తెలుసకుంటేనాకంతే చాలు!"

"ప్లీజ్! బయట ఈ మాటలొద్దు. లోపలకి రండి"

"నేను మీ మధ్యకి వస్తే మిమ్మల్నింకా బాధ పెట్టినట్టవుతుందే తప్ప ప్రయోజనం ఏమీ వుండదు. అందుకే ఇక్కడి కింకెప్పుడూ రాను. నా పాడు మొహం మీకు కనిపించనంత దూరం వెళ్ళిపోతాను" అంటూ తను తెచ్చిన ఉత్తరాన్ని ఆమె చేతుల్లో పెట్టి ఆమె గుక్క తిప్పుకొనేలోగా వీధి చీకట్లలో కలిసిపోయాడు మోహన్.

ఆమె మనస్సు చివుక్కుమంది. నిజంగా అతనిదేనా తప్పంతా? తనది మాత్రం ప్రలోభం కాదూ! మొదట్లోనే అతనికి దూరంగా జరిగి వుంటే ఇప్పుడీ వ్యధకీ లోను కావల్సి వచ్చేదా? తనకా వేళ ఏమయిందో – దౌర్భాగ్యం కొద్దీ మతి పోగొట్టుకుంది.

కొండంత భారంతో లోపలకి వచ్చిన భార్యని చూస్తూ "ఎవరూ!" అని అడిగాడు రాజారావు.

"ఆయనే... మోహన్!"

"లోపలకి రాలేదేం?" అన్నాడు నెమ్మదిగా.

అతని గొంతులోని ప్రశాంతత ఆమె గుండెల్ని పిండుతోంది. "మీ కిమ్మని ఇచ్చారు" అంటూ ఆ ఉత్తరాన్ని అతని కందించింది. అతనుదాన్ని చదువుతున్నంత సేపూ గుండె చేత పట్టుకుని నిలువునా వణికిపోయింది.

రాజారావు కనుకొలకుల నుంచి ఒలికిన అశ్రుధార అతని చెంపల మీదుగా దిండు మీదకి జారడం చూసింది పల్లవి. ఆమెకునవనాడులూ క్రుంగిపోయినట్టయింది. నిలబడలేక మంచం పక్కన నేల మీద కూలబడి పోయింది.

ఉత్తరం చదివిన భర్త ఒక్క ముక్కయినా మాట్లాడలేదు. ఒక్కసారయినా తన వైపు చూడలేదు. పైగా అటు తిరిగి పడుకున్నాడు. అంతకన్నా తనను ఊచి పుచ్చుకొని లెంపలు వాయించినా ఇంత బాధ కలిగేది కాదేమో!

అన్ని విధాల అనుకూలుడయిన భర్త! తనను తన ప్రాణ సమానంగా చూసుకునే భర్త. ఆ భర్తని తప్ప మరే మగవాడిని గురించి తన మనసెప్పుడూ చలించలేదు. అటువంటిది ఈ వేళ తనకేం జరిగింది? పిచ్చిపట్టిన దానిలా ప్రవర్తించిందెందుకని! ఈ తప్పుని మన్నించే మహోన్నత హృదయం తన భర్తకుండొచ్చు. కాని, ఏ మొహం పెట్టుకుని క్షమించమని అడగగలదు!

గుండెల్నించి వచ్చే ఆర్తనాదాన్ని బయటకు రానివ్వకుండా గ్రుక్కిళ్ళు మింగుతూ అలా నేలక్కరుచుకుపోయింది పల్లవి. ఆ రాత్రి ఆమె ఎంతగా ఏడ్చిందో ఆమె కన్నీటి ధారని భరించిన కటిక నేలకి మాత్రమే తెలుసు!

• • •

తలుపు తీసి ఎదుట నిలిచిన వ్యక్తిని చూసి తెల్లబోయాడు మోహన్.

"పల్లవీ! ఇంత చీకట్లో!"

"ఆయనకి రోజంతా జ్వరం."

"డాక్టరికి చూపించలేదూ!"

"చూపించాను. ఈ మధ్య తరచుగా జ్వరం వస్తోంది ఆయనకి. నాలుగు రోజుల్నించి కొంచెం కులాసాగా వుందనుకుంటే మళ్ళీ ఇవేళ మొదలయింది."

"దీనికి నేనే కారణం."

"ఆయన మీ గురించి ఒక్క మాటనలేదు."

"నిన్ను..."

చటుక్కున తలయెత్తింది ఆమె. "నన్నేమీ అనలేదు. అందుకే నాకు భరించలేని బాధగా ఉంది. ఇంతకన్నా" ఆ పైన మాట రాక ఆమె కంఠం రుద్ధమయింది.

"నేను రాకుండా వుంటేనే మంచిదేమో!"

"మిమ్మల్నెలాగయినా ఒప్పించి ఒక్కసారి తీసుకురమ్మన్నారు. ఏం జరగదలచుకుంటే అది జరుగుతుంది. ఒక్కసారి రండి ప్లీజ్!" అంది ఆమె దీనంగా.

రేగిన జుట్టు, నలిగిన బట్టలు, వాడిన ముఖం. ఒక్క రోజులో ఎంత చిక్కిపోయింది! పల్లవిని చూసేసరికి అతని మనస్సు ద్రవించిపోయింది.

బట్టలు మార్చుకొని ఆమెతో బయలుదేరాడు. రాజావింటికి రిక్షాలో చేరడానికి వాళ్ళకి పావుగంట పట్టింది. అంతసేపూ వాళ్ళ మధ్య ఒక్క మాట కూడా దొర్లలేదు. ఎన్నో రోజుల పరిచయం... ఆమె నవ్వకుండా అతనిని నవ్వించకుండా వుండడం ఎన్నడూ జరగలేదు. ఒక్క సంఘటన జీవితాల్లో ఎంతటి తుఫాను సృష్టించింది!... ఒక్కసారిగా మూగపోయాయి వాళ్ళ మనస్సులు!

"రారా!... ఎందుకురా నా మీద నీ కింత కోసం!" అంటూ రాజారావు నవ్వాడు.

"రాజా"

"ప్రోగ్రాము డేటు దగ్గరవుతుంటే మీ శిష్యురాలు సరిగా ప్రాక్టీసు చేస్తోందో లేదో చూసుకోవద్దూ! ఇవేళ నువ్వు రాలేదు. తను పాడలేదు. ఇలాగయితే ఎలారా!"

ఏమనాలో పాలుపోక మతి తప్పిన వాడిలా చూసాడు మోహన్.

"నిన్న నేను ఇంటికి వచ్చేసరికి మీ పాట వినిపించింది. బయట నిలబడి విన్నాను."

ఏదో భయంతో మోహన్ గుండె ఝల్లుమంది.

"ఎంత చక్కని పాట! గొంతులో గొంతు కలిపి మీరిద్దరూ అలా పాడుతుంటే నాకెంత ఆనందం కలిగిందో చెప్పలేను. దేవుడు అడక్కుండా వరం ఇచ్చాడంటారు ఇదే!.. ఒకరు ప్రేమించే భార్య, మరొకరు ప్రాణ స్నేహితుడు. నా కంటే అదృష్టవంతుడెవరుంటాడు?..."

ప్రేమ భావన తప్ప మచ్చుకయినా వ్యంగ్యార్థం ఎక్కడా కనిపించడం లేదే అతని మాటల్లో! అటువంటి మిత్రుడి మనస్సులో ముల్లులా గుచ్చుకొనే పని ఎందుకు చేయాలనిపించింది తనకు!.. మోహన్ హృదయ క్షోభ కంతులేకపోయింది.

".. నీ పాట ఏమిటో హఠాత్తుగా ముగించినట్టుగా వుందిరా నాకు. చివర మరో చరణం

చేరిస్తే బావుంటుందనిపించి రాసాను చూడు..." అంటూ తలగడ క్రిందున్న కాగితాన్ని తీసి అందించాడు రాజారావు.

మోహన్ చదివాడు.

మోహన్: నీ గానము..

పల్లవి : నీ కవితా...

ఇద్దరూ : కలిసి మెలిసి కాపురముంటే మన జీవన రాగమే మధుర గాన గీతిక కాదా!

మోహన్ : తియతీయగ నీ వీణా మ్రోగిందీ

పల్లవి : కమకమ్మగ నీ కవితా సాగింది.

అతని కందిన ముఖాన్ని చూసి నవ్వుతూ "గొప్పగా రాయకపోయినా కాంటెస్టుకు సరిపోయేలా వుంది కదూ!" అన్నాడు రాజారావు.

"రాజా!"

"మీరు పాడింది ఏ రాగం? శాస్త్ర ప్రకారం ఏమంటారో.. .కాని, నాకు మాత్రం సమ్మోహనరాగం అని పిలవాలని ఉంది" అని గలగల నవ్వాడు.

"ఇప్పటికే చేసిన పనికి సిగ్గుతో చచ్చిపోతున్నా. ఇంకా ఇలాంటి మాటలతో నన్ను చిత్ర వధ చేయకురా రాజా!" అన్నాడు మోహన్ రుద్ధకంఠంతో.

రాజారావు ముఖం వాడిపోయింది. "నిజం చెపితే నీకు చిత్రవధ చేసినట్టుందా?"

"అది కాదు రాజా! నేను చేసింది తప్పే! మిత్ర ద్రోహం చేసిన వాడ్ని సహించడం కన్నా బాధ మరొకటి వుండదు. నేను నీకు చేసిన ఘోరానికి నన్ను తవ్వి పాతెయ్యడానికి కూడా నీకు హక్కుంది. అందుకే నీకీ పాడు ముఖం చూపించకుండా దూరంగా పోదామనుకున్నాను. ఇంకే విధంగా ప్రాయశ్చిత్తం చేసుకోను. చెప్పు రాజా! చెప్పు..." అంటూ తన చేతులతో ముఖం కప్పుకొని బావురుమన్నాడు మోహన్.

"పల్లవీ!" అని గట్టిగా పిలిచాడు రాజారావు. కాని, అతని గొంతు ఎంతో నీర్సంగా ఉంది.

బిక్కు బిక్కు మంటూ వచ్చింది ఆమె. కళ తప్పిన ఆమె ముఖం చూస్తూ "మైగాడ్!... మీరిద్దరూ ఎందుకిలా అయిపోతున్నారు. నేమన్నానని! మీ కళ్ళకి అంత కర్కోటకుడిలా కనిపిస్తున్నావా?" అన్నాడు నిస్పృహగా, నిస్సత్తువగా.

"లేదండీ లేదు. మీరేమీ అనలేదు." అని ఆర్థోక్తిలో ఆగిపోయింది ఆమె. "మీరేమీ అనకపోవడమే అసలు నా బాధ" అని ఆమె అంటున్నట్టు ఆగిపోయింది.

జ్వరభారంతో లేవలేకపోతున్న భర్తకు ఆసరా ఇచ్చి లేవదీసి కూర్చోపెట్టింది. మంచినీళ్ళు కావాలన్నట్టు సంజ్ఞ చేశాడతను. ఆమె వెళ్ళి తెచ్చింది. ఆ గ్లాసు అందుకొని ముందుకు వంగి మోహన్ వెన్ను తట్టుతూ "ఒరేయ్ మోహనా! ఇవి తాగు" అన్నాడు రాజారావు.

మోహన్ నిశ్శబ్దంగా గ్లాసెడు నీళ్ళు తాగాడు.

"మీ ఇద్దర్కీ ఓ సంగతి చెప్పాలి. ఇలా రండి. ఇద్దరూ నా దగ్గరగా వచ్చి కూర్చోండి" అన్నాడు ఇద్దర్నీ చెరో చేత్తో పట్టుకుంటూ.

"నీ వొళ్ళు వెచ్చగా ఉంది. ఇంకా జ్వరం......"

మోహన్‌మాటల కడ్డు వచ్చాడతను. "ఇప్పుడు చెప్పడం నా వంతు. వినడం నీ వంతు. నా మాటలు శ్రద్ధగా విను. ఇన్నాళ్ళూ నువ్వు పెళ్ళి చేసుకోలేదు. దానికి ప్రత్యేకమైన కారణం అంటూ లేదు. అవునా!.. అలాగే పల్లవి నేర్చుకుంటున్న సంగీతాన్ని మా పెళ్ళికి ముందే మానేసిందిట. ఎందుకంటే ఒక కారణమంటూలేదని అంటుంది. అవును కదూ?" పల్లవి తల వూపింది.

"ఈ వూరు ట్రాన్స్ఫరు కావడం.. అనుకోకుండా మళ్ళీ మనం కలవడం పల్లవికి సంగీతం చెప్పమని నిన్ను నేను అడగటం... మళ్ళీ తమ పాటలు పాడడం.. చివరికి పబ్లిక్ పెర్మార్ మెన్సుకి నువ్వు ఏర్పాట్లు చేసేదాకా వెళ్ళడం.. ఇదంతా ఎందుకు జరిగింది అని ఒకసారి వెనక్కి చూసుకుంటే.. ఒక్కటే నాకనిపిస్తోంది... మిమ్మల్నిద్దర్నీ ఒక బంధంలో ముడివేయడానికి నాంది ప్రస్తావన ఎప్పుడో జరిగిందని!"

"ఛ! ఏం మాటల్రా ఇవి?" అన్నాడు మోహన్ ఎర్రబడిన ముఖంతో. పల్లవి పరిస్థితి అంతకన్నా మెరుగ్గా ఏమీ లేదు.

"సంగీతం జీవితంలో ఒక భాగమయితే అంతకు మించిన వరం లేదు. రెండు కళా హృదయాల్ని కలపడానికి నేనొక నిమిత్తమాత్రుడ్ని అవుతానని నేనింత కాలం ఊహించ లేకపోయాను మోహన్! ఇప్పుడు నాకెంత సంతోషంగా వుందో నీకు తెలియదు."

"ఏమండీ ఏమిటండీ ఈ మాటలు! ఒక్క పొరపాటుకి నాకింత శిక్ష వేస్తారా?" అంది పల్లవి గ్రుడ్ల నీళ్ళు కక్కుకుంటూ.

"పిచ్చిదానా! ఇంకా నేనేదో మనసులో పెట్టుకుని మిమ్మల్ని సూటీపోటీ మాటలంటూ కచ్చి తీర్చుకుంటున్నాననుకుంటున్నారా? ఎలా చెపితే మీరు నా మాటలు నమ్ముతారు? బ్రతికుండగా మిమ్మల్నిద్దర్నీ కలిపానన్న తృప్తిని నాకెందుకు దక్కనివ్వరు? ఈ జీవితం ఇంకెంతో ఏమో! మీరిద్దరూ కలిసి పాడుతుంటే వినగలిగే అదృష్టం కోసం మరికొంత కాలం నేను బ్రతగ్గలిగితే చాలు.. ఈ జీవితంలో నాకింకే కోరికలూ లేవు!"

"ఏమండీ! మోహన్‌గారూ! జ్వరం తీవ్రంగా వుంది. ఈయనేదేదో మాట్లాడుతున్నారు. నాకు చాలా భయంగా వుంది.." అంది పల్లవి కంపించిపోతూ.

"డాక్టర్ని తీసుకువస్తాను" అంటూ లేవబోయాడు మోహన్.

"వెళ్ళేముందు ఒక్కమాట విని వెళ్ళు మోహనా!" అని అతని చేయి పట్టుకుని ఆపాడు రాజారావు.

చెప్పమన్నట్టు చూసాడు మోహన్.

"పల్లవి ముఖం చూడు... ఆమె ముఖం ఇంత కళావిహీనంగా వుండడం ఎప్పుడేనా

చూసావా? లేదు కదూ! నాకొక్క ప్రామిస్ చేస్తావా?"

"ఏమిటీ?"

"రేపు నా కేదయినా అయితే.. నా పల్లవిని ఆదుకుంటానని మాటివ్వవూ!"

"ప్లీజ్! అలాంటి మాటలు అనకు రాజా! ఇప్పుడు నీ కేమీ కాలేదు. నువ్వూ, పల్లవీ కలకాలం సుఖంగా వుంటారు?"

"నిన్నటిదాకా నేనూ అలాగనే అనుకున్నాను మోహనా! ప్రిమోనిషన్ అంటారే! నిన్నూ, పల్లవినీ సంగీతం పేరన ఒకచోటుకి చేర్చాలని ఆర్నెల్లుకి ముందే నాకెందుకు అనిపించిందో... బహుశా, ఇందుకే కాబోలు!"

"ఏమిటిరా!" అని మోహన్, "ఏమిటండీ!" అని పల్లవి ఒక్కసారే అడిగారు.

"అయామ్ ఇన్ ది లాస్ట్ స్టేజ్ ఆఫ్ మై లాఫ్!"

"అబద్ధం!" ఇద్దరూ ఒకేసారి అరిచినంత పని చేశారు.

"ఇంత బాధలో కూడా ఒకే మాట! ఒకే స్వరం... మీ మనస్సులు నిష్కల్మషమైనవనడానికి ఇంతకంటే ఏం ప్రూఫ్ కావాలి? బోతాఫ్ యు లవ్ మీ సో మచ్ అయామ్ నాటెటాల్ అఫ్రయిడ్ ఆఫ్ డెత్ నౌ!"

"డాక్టర్ని తీసుకువస్తానుండు..." అని కదలబోయాడు మోహన్.

రాజారావు అతని చేయి గట్టిగా పట్టుకొని "... ఇక నుంచి చివరి క్షణం వరకూ డాక్టర్ల చేతుల్లోనే గడపాల్సి వస్తుంది.. ఈ నాలుగు క్షణాలు నీతో మాట్లాడే అవకాశం పోనివ్వకురా మోహనా!" అన్నాడు.

"లేనిపోని భయాలేవో నిన్ను వొర్రీ చేస్తున్నాయి. నీ కేం కాలేదు రాజా!"

"డాక్టరు రిపోర్టు చూసే దాకా నేనూ అలానే అనుకున్నాను" అంటూ తలగడ క్రింద వున్న లెదర్ బ్యాగ్ తీసి అందులోంచి ఏవో కాగితాల కట్టకి మడతలు విప్పాడు. ".. చివరి దాకా మీకీ సంగతి చెప్పకూడదనే అనుకున్నాను. కానీ, నిన్న రాత్రి నీ ఉత్తరం చూసాక నాకు చెప్పక తప్పలేదు. నువ్వెక్కడికో వెళ్ళిపోతే.. రేపు పల్లవి జీవితం ఏం కావాలి? పల్లవి జీవితం కన్నీటిపాలయితే నా ఆత్మకి శాంతి దొరుకుతుందా?"

అసహనంగా అతని చేతుల్లోని కాగితాలు లాక్కున్నంత పని చేసాడు మోహన్.

అతని ముఖం వివర్ణమవడం చూసి ఏదో భయంతో విలవిలలాడిపోయింది పల్లవి.

"లు...కే....మి....యా..." అన్నాడు మోహన్ తడబడుతూ.

"అంటే?" అంది పల్లవి గుండె చేత పట్టుకుని.

"బ్లడ్ కేన్సర్!" అన్నాడు రాజారావు నెమ్మదిగా.

పల్లవి గుండెలవిసిపోయాయి.

●